www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING
CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:65 WEDNESDAY ,JULY 15,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 65 బుధవారం 15 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-



## నితిన్ గడ్కరీతో రేవంత్ రెడ్డి భేటీ

- 20 రోజుల వ్యవధిలో రెండోసారి ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి
- రీజనల్ రింగ్ రోడ్డు పనుల గురించి గడ్కరీతో చర్చించిన సీఎం
- రామ్మోహన్ నాయుడిని కూడా కలవనున్న ముఖ్యమంత్రి

హంసకలం వార్త

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఫుల్ బిజీగా ఉన్నారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఆయర రెండోసారి ఢిల్లీకి వెళ్లడం గమనార్హం. ఈ ఉదయం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రేవంత్ కలిశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర (నార్త్) భాగం పనులకు వెంటనే కేబినెట్ ఆమోదం తెలపాలని, దక్షిణ భాగానికి పూర్తి అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జాతీయ రహదారులను డ్రై పోర్టులతో అనుసంధానించే కొత్త దారులకు మిగతా2లో

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి

2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి

కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన 2

వేగంగా భూసేకరణ పూర్తి చేయడంపై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం





## ఉడాన్ పథకం మరో పదేళ్లు పొడిగిస్తున్నాం

-బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతాం.. 7

-ఆదిలాబాద్ ప్రాజెక్ట్‌కు సుమారు 1,500 ఎకరాల భూసేకరణ చేయాలి..

# కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణం



- ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం: పొన్నం ప్రభాకర్
- ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి

హంసకలం వార్త :కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా2లో



## కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనపడట్లేదా?

- ఒవైసీ కాలేజీ చెరువులో కబ్జా లేదని నమ్మించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందన్న బండి సంజయ్
- ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ పరిధిని మారుస్తోందని విమర్శ
- నచ్చని వారిని టార్గెట్ చేసుకుని దాడులు చేయడం సరికాదని హితవు

ప్రపంచమంతా చూస్తున్నా.. ఒవైసీ కళాశాల చెరువులో లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నమ్మించే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు.



## నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి..

### రైతులకు మంత్రి తుమ్మల సూచన

హంసకలం వార్త : ఎల్‌నినో ప్రభావంపై తెలంగాణలోని రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. తెలంగాణలో 30 నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదయిందని భారత వాతావరణ విభాగం వెల్లడించిందని మిగతా2లో




## కాళేశ్వరంపై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

- గోదావరి నీళ్లు సముద్రంలోకి వెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- కేసీఆర్ కీర్తిని దెబ్బతీసేందుకే కుట్ర జరుగుతోందని వ్యాఖ్య
- వెంటనే నీటిని ఎత్తిపోయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరిక

హంసకలం వార్త : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను 2లో

## ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు

### అందుకే నాకు కోపం




–'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న కవిత –చిన్న సినిమాలకు, నిర్మాతలకు అండగా ఉంటామని కల్వకుంట్ల కవిత హామీ –భవిష్యత్తులో అధికారంలోకి వస్తే కొత్త సినీ పాలసీ తెస్తామని ప్రకటన –'మూడు రంగుల జెండా' పాటతో ఒకరు సీఎం అయ్యారంటూ ఆసక్తికర వ్యాఖ్య 2

## చెరువుల అభివృద్ధికి రూ.227 కోట్లు

### హైడ్రాకు రూ.12.50 కోట్లు

హంసకలం వార్త : హైదరాబాద్ నగర పరిధిలో( ఓఆర్ఆర్ లోపల) నాలుగు చెరువుల అభివృద్ధికి తొలి దశ కింద రూ.227.98 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులిచ్చింది. చెరువుల పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.74.35 కోట్లతో జీడిమెట్ల ఫాక్స్ 2లో





జీవకణంలా ఆకారం మార్చుకునే లిక్విడ్ మెటల్ రోబో ఆవిష్కరణ
దక్షిణ కొరియాలోని సియోల్, గచోన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల విజయం
విడిపోవడం, తిరిగి కలవడం, వస్తువులను మింగేయడం దీని ప్రత్యేకతలు

## కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ!

### విడిపోతుంది, కలుస్తుంది, వస్తువులను మింగేస్తుంది..

హంసకలం వార్త :టెక్నాలజీ రంగంలో మరో అద్భు తం ఆవిష్కృతమైంది. దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు జీవకణం లా ప్రవర్తించే, తన ఆకారాన్ని మార్చుకోగల ఒక వినూత్న మైన లిక్విడ్ మెటల్ రోబోను అభివృద్ధి చేశారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, గచోన్ యూనివర్సిటీ మిగతా2లో

## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం...

### పెద్దపల్లి మున్సిపల్ ఏఈ ఇంట్లో నోట్ల కట్టలు!

-పెద్దపల్లి మున్సిపల్ ఏఈ కల్లేపల్లి సతీశ్ కుమార్ అరెస్ట్
-రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత
-కాంట్రాక్ట్ బిల్లు మంజూరు కోసం లంచ



హంసకలం వార్త : పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీ తి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి మిగతా2లో

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్ట కూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావా లని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నా యుడుతో సమావే శమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీ య ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల కు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరిం చారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయి నందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

**వరంగల్ కీలకం**

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

# నితిన్ గడ్కరీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి

రాష్ట్ర జాతీయ రహదారులను డ్రై పోర్టులతో అనుసంధానించే కొత్త దారులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కూడా రేవంత్ కలవను న్నారు. తెలంగాణలో మూడు ఎయిర్ పోర్టులకు సంబంధించి చర్చిం చనున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కూడా ముఖ్యమంత్రి భేటీ కానున్నారు.

# నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి..

తెలంగాణలో 30 నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదయిందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించిందని తెలిపారు. వచ్చే మూడు నెలలూ వర్షాభావ పరిస్థితులే ఉండవచ్చని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల లభ్యత కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన సూచించారు.వరి, చెరకు వంటి అధిక నీటి పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వారికి వివరించారు. జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు మంత్రి తుమ్మల వివరించారు. తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే వంగడాలు ఎంచుకోవాలని రైతులకు స్పష్టం చేశారు. వ్యవసాయ, నీటి పారుదల, భూగర్భ జలాలు – భారత వాతావరణ విభాగం సమన్వయంతో రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తామని చెప్పారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. చిరు ధాన్యాల సాగు పెంచాలని హైదరాబాద్‌లోని ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (IIMR) సూచించిందని గుర్తు చేశారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో వర్షాభావాన్ని ఎదుర్కోవాలని నిపుణులు సూచనలు చేశారని పేర్కొన్నారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# ఆ పాటతో ఒకరు సీఎం అయ్యారు.. అందుకే నాకు కోపం

చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసిం చారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.సినిమా టైటిల్ 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రస్తావన రాగా, 'తాలూకా' అనే పదం తెలంగాణలో అంతగా వాడుకలో లేదని కవిత అన్నారు. ఈ పేరు విన్నప్పుడు కాస్త భిన్నంగా అనిపించినా, భౌగోళికంగా రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటేనని, మనమంతా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇరు ప్రాంతాల సంస్కృతులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే భాష, సంస్కృతి నిలబ డతాయని, తెలుగు చిత్రసీమ మనందరినీ కలిపే ఒక గొప్ప మాధ్యమంగా ఉండాలని పిలుపునిచ్చారు.చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై కవిత తన ప్రసంగంలో ప్రధా నంగా దృష్టి సారించారు. "తమిళ, కన్నడ పరిశ్రమల మాది రిగా మన దగ్గర చిన్న నిర్మాతలకు, థియేటర్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేవు. ఎంతో ప్రతిభ ఉన్నా సరైన అవకా శాలు దక్కడం లేదు. ఓటీటీల రాకతో మేలు జరుగుతుందని ఆశించినా, అవి కూడా పూర్తిగా వ్యాపార ధోరణిలోనే నడుస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు అమ్మి, సర్వస్వం పణంగా పెట్టి సినిమాలు తీసే చిన్న నిర్మాతలు బాగుంటేనే చిత్ర పరిశ్రమ మనుగడ సాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. "చిన్న నిర్మాతలకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుంది. భవిష్యత్తులో మాకు అధికారం వస్తే, తప్పకుండా చిన్న చిత్రాలకు ప్రయోజనం చేకూరేలా సరికొత్త సినీ విధానాన్ని రూపొందిస్తాం" అని కవిత హామీ ఇచ్చా రు.కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రంలో దినేశ్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరో యిన్‌గా పరిచయం అవుతున్నారు. సతీశ్ ఆవాల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది.

# చెరువుల అభివృద్ధికి రూ.227 కోట్లు

చెరువుల పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ. 74.35 కోట్లతో జీడిమెట్ల ఫాక్స్ సాగర్, రూ. 68 కోట్లతో అమీన్‌పూర్ చెరువు, రూ. 35 కోట్లతో అంబర్ చెరువు(భాగ్‌మీర్), రూ. 50.63 కోట్లతో సరూర్‌నగర్ చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది.మూడు దశల్లో ఈ నాలుగు చెరువుల పనులు చేపట్టనున్నారు. నాలుగు చెరువుల అభివృద్ధికి రూ. 536 కోట్లు ఖర్చు చేయనుంది. రెండో దశలో రూ. 147.46 కోట్లు, మూడో దశలో సుందరీకరణ పనులకు రూ. 161.06 కోట్లు వెచ్చించనున్నారు. ఈ పనులను హైడ్రా ద్వారా చేపట్టనున్నట్లు తెలిపింది. మరో ఉత్తర్వులో ప్రభుత్వం హైడ్రాకు రూ. 12.50 కోట్ల నిధుల విడుదలకు ఉత్తర్వులిచ్చింది.

# కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణం

రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనపడట్లేదా?

ప్రపంచమంతా చూస్తున్నా.. ఒవైసీ కళాశాల చెరువులో లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నమ్మించే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. నిరుపేదల ఇళ్లను కూల్చడానికి ఉన్న ఉత్సాహం, అందరికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న ఈ భారీ ఆక్రమణలపై ఎందుకు చూపించడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు నిజంగానే కంటిచూపు సమస్య ఉందా? లేక ఎంఐఎంతో ఉన్న రాజకీయ బంధం వల్ల ఆ సంకల్పం లోపించిందా? అంటూ ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ నాయకుల కంటి జబ్బును నయం చేసేందుకు బీజేపీ కార్యకర్తలంతా కలిసి ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు నిర్వహించాలని బండి సంజయ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కళ్లు పరీక్షించాక కూడా అక్కడ చెరువు ఆక్రమణ కనిపించకపోతే, అది కంటి లోపం కాదని, కచ్చితంగా రాజకీయ లోపమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ అవసరాలకు, ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ పరిధి గీతలను ఇష్టమొచ్చినట్లు మారుస్తోందనే అనుమానాలు ఇప్పుడు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయన్నారు.చట్టం ముందు అందరూ సమానమేనని కాగితాల మీద చెప్పే ప్రభుత్వం... ఆచరణలో మాత్రం పేదలకు ఒక న్యాయం, అధికార పక్షానికి దగ్గరగా ఉండే ఎంఐఎం లీడర్లకు మరో న్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. నచ్చిన వారిని వదిలేసి, నచ్చని వారిపై ఎంపిక చేసుకుని మరీ దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. చెరువుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం ఈ ద్వంద్వ వైఖరిని పక్కనబెట్టాలని డిమాండ్ చేశారు.



# ఇరాన్‌కు భారత్ గట్టి హెచ్చరిక!

హర్మూజ్ జలసంధిలో యూఏఈకి చెందిన చమురు ట్యాంకర్లపై జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జావెద్ హుస్సేనీని విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. ఒమన్‌కు సమీపంలోని హర్మూజ్ జలసంధి దక్షిణ మార్గంలో ప్రయాణిస్తున్న 'మొంబాసా', 'అల్ బహియాహ్' చమురు ట్యాంకర్లపై ఈ దాడి జరిగింది. 'మొంబాసా' నౌకలో పనిచేస్తున్న ఓ భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడగా, వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి కారణంగా రెండు ట్యాంకర్లలోనూ మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. అయితే వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో రెండు నౌకలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఈ దాడిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి ఇది తీవ్ర ముప్పు అని అభివర్ణించింది. ఈ పరిణామంపై స్పందించే పూర్తి హక్కు యూఏఈకి ఉందని స్పష్టం చేసింది. దేశ భద్రత, ప్రజలు, జాతీయ ప్రయోజనాలు, కీలక ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ, కునారం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ. 12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి, మంజూరు కోసం పంపడానికి సతీశ్ కుమార్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు పక్కా ప్రణాళికతో సతీశ్ కుమార్ నివాసంలో అతడు లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు.లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్న అనంతరం, ఏసీబీ అధికారులు సతీశ్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని రూ. 32,31,900 నగదు లభించడంతో అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. లంచం సొమ్ముతో పాటు ఈ నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు సతీశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలను కోరింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# కాళేశ్వరం పై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు..

రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను ఉద్దేశపూర్వకంగానే సముద్రం పాలు చేస్తూ రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు.సోమవారం కరీంనగర్ జిల్లాలోని మిడ్ మానేరు జలాశయాన్ని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోవడమే కాకుండా, హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరికి వరద ప్రవాహం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ నీటిని విజయవంతంగా ఎత్తిపోస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.మరమ్మతులు పూర్తయినప్పటికీ,కేవలం రాజకీయ దురుద్దేశంతో ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికను సాకుగా చూపి తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేయడంలేదని ఆరోపిం చారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించినఈ ప్రాజెక్టుకు చెడ్డపేరు తెచ్చేందుకే కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ!


టెక్నాలజీ రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు జీవకణంలా ప్రవర్తించే, తన ఆకారాన్ని మార్చుకోగల ఒక వినూత్నమైన లిక్విడ్ మెటల్ రోబోను అభివృద్ధి చేశారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, గచోన్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా రూపొందించిన ఈ రోబో, సాఫ్ట్ రోబోటిక్స్ రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ అధ్యయన వివరాలు ప్రముఖ సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ రోబోను ద్రవరూప లోహం (లిక్విడ్ మెటల్), అయస్కాంత కణాలతో తయారుచేశారు. దీని బయటి పొరపై నీటిని వికర్షించే (సూపర్ హైడ్రోఫోబిక్) కణాలతో కవచంలా ఏర్పాటు చేశారు. దీనివల్ల ఇది తన ఆకారాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉంటుంది. బయటి నుంచి అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి బ్యాటరీలు లేదా మోటార్లు లేకుండానే దీనిని నియంత్రించవచ్చు. ఈ రోబో తన పరిమాణం కన్నా చిన్నవైన, ఇరుకైన ప్రదేశాల్లోకి కూడా సులభంగా దూరిపోయి, బయటకు వచ్చాక తిరిగి తన అసలు ఆకారాన్ని సంతరించుకోగలదు. అంతేకాదు, అవసరమైనప్పుడు చిన్నచిన్న రోబోలుగా విడిపోవడం, మళ్లీ అన్నీ కలిసి ఒకే రోబోగా మారిపోవడం దీని ప్రత్యేకత. శరీరంలోని కణాలు బాహ్య పదార్థాలను మింగేసినట్టుగా (ఫాగోసైటోసిస్), ఈ రోబో కూడా చిన్న వస్తువులను తనలో ఇముడ్చుకుని ఒకచోటి నుంచి మరోచోటికి రవాణా చేయగలదు. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించడానికి, శరీరంలోని నిర్దిష్ట భాగాలకు మందులను చేరవేయడానికి, అతి సూక్ష్మమైన సర్జరీలు చేయడానికి దీనిని ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగశాల దశలో ఉన్న ఈ రోబో, భవిష్యత్తులో పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో కూడా కీలకపాత్ర పోషించగలదని అంచనా వేస్తున్నారు.


# సంపాదకీయం


## ‘1/70’ స్ఫూర్తిని ‘సుప్రీం’ నిలబెడుతుందా?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన భూముల పరిరక్షణకు బలమైన కవచంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/1970 మరోసారి సుప్రీంకోర్టు న్యాయ పరిశీలనను ఎదుర్కొంటోంది. గిరిజనేతరులకు గిరిజనుల భూముల బదలాయింపును నిషేధిస్తూ, తరతరాలుగా అన్యాక్రాంతమవుతున్న ఆదివాసీ భూములను కాపాడే లక్ష్యంతో రూపొందిన ఈ రెగ్యులేషన్ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ వందలాది మంది ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర గిరిజనేతరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గిరిజనేతరుల ఈ వ్యాజ్యాలు, వారి వాదనలు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఆందోళన కలిగిస్తున్నాయి.ఉతెలంగాణకు చెందిన సూరెడ్డి రమణారెడ్డి, ఇతర పిటిషనర్లు 2011 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకొని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామాలు, మండల కేంద్రాలలో గిరిజనేతరులు అధిక సంఖ్యలో ఉన్నారని వాదిస్తున్నారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద గిరిజనేతరులకు భూములు కొనుగోలు చేయడానికి లేదా కౌలుకు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని వారు పేర్కొంటున్నారు. వాస్తవానికి రెగ్యులేషన్ 1/70 ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న కారణంగానే సన్నకారు గిరిజనేతర వర్గం చేతుల్లో భూములు ఇంకా ఉన్నాయి. ఏజెన్సీలో గిరిజనేతర భూ క్రయ విక్రయాలు అనుమతించినట్లయితే భూస్వామ్య, వాణిజ్య వర్గాల ఆధీనంలోకి వారి భూములు ఏనాడో చేజారిపోయేవి. 1/70 రెగ్యులేషన్ రద్దయితే గిరిజనులకే కాదు, సన్నకారు రైతాంగానికి, వ్యవసాయ కూలీలకూ తీరని నష్టం. రెగ్యులేషన్ 1/70 నిబంధనలు రాజ్యాంగంలోని 14, 19, 21, 300--ఎ అధికరణలకు విరుద్ధమని వాదిస్తూ, కాలానుగుణంగా మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ రెగ్యులేషన్ పునఃపరిశీలించాలని యర్రంశెట్టి సత్యనారాయణతో పాటు 1,672 మంది గిరిజనేతరులు మరొక రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. 1988లో పి.రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు రెగ్యులేషన్ 1/1970 రాజ్యాంగబద్ధతను స్పష్టంగా సమర్థించింది. గిరిజనేతరుల మధ్య భూమి బదలాయింపు నిషేధించడం గిరిజన భూముల పరిరక్షణకు అవసరమని కోర్టు పేర్కొంది. 1997లో సమతా కేసులో సుప్రీంకోర్టు గిరిజనులకు భూమి కేవలం ఆర్థిక వనరు కాదని, అది వారి సంస్కృతి, జీవన విధానం, సామాజిక గుర్తింపు, ఆర్థిక మనుగడకు మూలాధారమని పేర్కొంది. 2013లో ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ కేసులో కూడా గిరిజన సమాజానికీ వారి భూములకూ మధ్య విడదీయలేని సంబంధాన్ని సుప్రీంకోర్టు గుర్తించింది. పస్తుత పిటిషనర్లు ‘రూపాంతర రాజ్యాంగవాదం’ సిద్ధాంతం ఆధారంగా రెగ్యులేషన్ 1/70ను సవాలు చేస్తున్నారు. కానీ ఈ సిద్ధాంతం చారిత్రకంగా అణచివేయబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించడానికే ఉద్దేశించబడింది. భారతదేశంలో అత్యంత వెనుకబడిన, దోపిడీకి గురైన వర్గాలలో షెడ్యూల్డ్ తెగ ఒకటి. కాబట్టి వారికి కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించడం రూపాంతర రాజ్యాంగవాదం లక్ష్యాలకు విరుద్ధంగా ఉంటుంది. షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనులకంటే గిరిజనేతర జనాభాయే అనేక ప్రాంతాలలో అధికంగా ఉన్న కారణంగా 1/70 అమలు చేయడం న్యాయం కాదంటున్నారు. వాస్తవానికి జనాభా మార్పులు రాజ్యాంగ హామీలను రద్దు చేయలేవు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరుల సంఖ్య పెరిగిందన్న కారణంతో రక్షణ చట్టాలను రద్దు చేయాలని అనుమతిస్తే, వలసలు ఆక్రమణల ద్వారా ఏర్పడిన పరిస్థితులే గిరిజనుల రాజ్యాంగ హక్కులను నిర్వీర్యం చేసినట్లవుతుంది. పరోక్షంగా రెగ్యులేషన్ 1/70ను ప్రభుత్వాలు అమలుచేయడం లేదని అంగీకరించినట్లవుతుంది. గిరిజనుల భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక గుర్తింపును కాపాడటమే రాజ్యాంగ అయిదవ షెడ్యూల్ లక్ష్యం. జనాభా మార్పులను ఆధారంగా తీసుకొని గిరిజన రక్షణల నియమాలను బలహీనపరిస్తే రాజ్యాంగ హామీలే అర్థరహితమవుతాయి. రెగ్యులేషన్ 1/70 బలహీనపడితే దాని ప్రభావం కేవలం భూమి హక్కులకే పరిమితం కాదు, దానితో ముడిపడి ఉన్న పంచాయతీరాజ్ (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం--1996, అటవీ హక్కుల చట్టం--2006, గిరిజన స్వయం పాలన వ్యవస్థలు, గ్రామ సభల అధికారాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ఆదివాసీ భూమి హక్కులు కేవలం ఆస్తి హక్కులకు సంబంధించిన అంశాలు మాత్రమే కావు. అవి వారి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, సంప్రదాయ జ్ఞానం, ఆర్థిక మనుగడ, సమష్టి అస్తిత్వంతో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఆదివాసీ భూమి వనరుల హక్కు విషయంలో ప్రత్యేక రక్షణలను కల్పించాయి. అంతర్జాతీయ ప్రమాణాలు కూడా గిరిజన హక్కుల పక్షాన ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి ఆదివాసీ ప్రజల హక్కుల ప్రకటన(2007), అంతర్జాతీయ కార్మిక సంఘం కన్వెన్షన్--169 వంటి అంతర్జాతీయ ప్రమాణాలు ఆదివాసీ ప్రజల భూమి, సహజ వనరులను రక్షించాల్సిన బాధ్యతను దేశాలపై విధిస్తున్నాయి. గిరిజనులను భూమి కోల్పోవడం నుంచి, ఆర్థిక దోపిడీ నుంచి, సాంస్కృతిక విచ్ఛిన్నం నుంచి రక్షించడానికి రూపొందించిన ప్రత్యేక చట్టాలు గిరిజనేతరుల పట్ల వివక్షపూరితమైనవి కావు. అవి వాస్తవ సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని సాధించడానికి అవసరమైన రాజ్యాంగ చర్యలు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంత 1/1970 రెగ్యులేషన్ వెనుక ఉన్న తాత్విక, రాజ్యాంగపరమైన భావన కూడా ఇదే. ఈ రెగ్యులేషన్ గిరిజనేతరులను వెలివేయడానికి రూపొందించబడినది కాదు. ఇప్పటి వరకూ దోపిడీకి గురైన గిరిజన సమాజాలను అటవీ, భూ, ఆర్థిక వనరుల నుంచి విస్థాపనను, సాంస్కృతిక విధ్వంసాన్ని నివారించడానికి రూపొందించబడిన ఒక రాజ్యాంగ పరిరక్షణ వ్యవస్థ. సుప్రీంకోర్టు ముందున్న నేటి ఈ వివాదం భూమి హక్కుల వివాదం మాత్రమే కాదు. ఇది భారత రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూల్ ఇచ్చిన హామీల భవిష్యత్తుకు సంబంధించిన అంశం. రెగ్యులేషన్--1 ఆఫ్ 1970 కాలం చెల్లిన చట్టం కాదు. గిరిజనుల భూమి, అస్తిత్వం, సాంస్కృతిక గుర్తింపు, సంప్రదాయ జీవన విధానం, స్వయం పాలనను కాపాడే అత్యంత ముఖ్యమైన రాజ్యాంగ పరిరక్షణ ఇది. అందువల్ల కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టులో బలంగా సమర్థించాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయి. ఎందుకంటే ఈ రక్షణల బలహీనత గిరిజన సమాజాల భవిష్యత్తుపైనే ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

# ‘సర్’.. ఏ అసమర్థతలకు చిహ్నం?






మనం జ్ఞానం పొందటంలో ప్రత్యక్ష అనుభవానికి మించింది మరొకటి ఉండదు. అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోయినా రాజకీయాల్లో ప్రత్యక్ష అనుభవానికి ఉన్న పాత్ర చాలా ఎక్కువ. ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన (సర్) ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్లు స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికితీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ఏం జరిగిందో, దానికి మూల్యం ఎవరు చెల్లించారో అర్థంచేసుకోవటం కష్టం కాదు. సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే. కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డూ అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టూ చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి. పోనీ వీళ్లు అయినా కేంద్ర మంత్రులు ప్రచారం చేస్తున్నట్లు కోట్లలో ఉన్నారా? సరిహద్దు రాష్ట్రాలన్నీ అక్రమ వలసదారులతో నిండిపోతున్నాయా? అని పరిశీలిస్తే అలాంటి భయానక దృశ్యం కనపడదు. అసాంలో 2025--26లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ రివిజన్) చేపట్టారు. ఆ సందర్భంగా తొలగించిన ఓట్లు 2,43,485 మాత్రమే. వీళ్లల్లో చనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయి. పోనీ ఇందులో సందేహాస్పద ఓటర్లు ఎంతమందో అధికారికంగా ప్రకటించనూలేదు. అలా ప్రకటిస్తే కనీసం అక్రమవలసదారుల గురించి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం ఉండేది. సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇంకో విషయాన్ని చూసినా అక్కడి అసలు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 1997 నుంచి 2023 వరకూ అసాంలో మొత్తం 2,44,144 మందిని అనుమానాస్పద ఓటర్లుగా భావించి వారి పౌరసత్వాన్ని తేల్చటానికి ఫారెన్ ట్రైబ్యునళ్లకు నివేదించారు. వీళ్లందరూ అక్రమవలసదారులే అనుకున్నా మొత్తం ఓటర్లలో వారు ఒకశాతం మాత్రమే ఉంటారు. కానీ వీళ్లల్లో 51,505 మందిని మాత్రమే విదేశీయులుగా తేల్చారు. మరికొందరిని భారతీయులుగానే పరిగణించారు. కొన్ని కేసులు ఇంకా ట్రైబ్యునళ్లలో నడుస్తున్నాయి. రాజకీయ లబ్ధికోసం చేసే ఆర్భాటప్రకటనలకూ వాస్తవాలకూ మధ్య దూరం మామూలుగా ఉండదని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది. తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో (వన్ టైం పాస్‌వర్డ్స్) ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్న తలెత్తకమానదు. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. 2002 నాటి సర్ ఎంతచక్కగా జరిగిందో తెలుసుకోవాలంటే అప్పటి పత్రికల కథనాలు చూస్తేగానీ విషయం అర్థంకాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటిపేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదుచేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత ‘మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి’ అని చివరికి అదే కమిషన్ ఆదేశించటం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి. గ్రామాల్లో చనిపోయిన వారి సమాచారం స్థానిక పంచాయతీ సిబ్బంది దగ్గర ఉంటుంది. కనీసం దాని ఆధారంగా ప్రతిఏటా జరిగే ఓటర్ల సవరణ ప్రక్రియలో వాళ్ల పేర్లను తేలికగానే తొలగించవచ్చు. అది కూడా చేయలేని అసమర్థతను ఎన్నికల కమిషన్ యంత్రాంగం ప్రదర్శించింది. ఇటీవల సర్ చేపట్టిన రాష్ట్రాల్లో ఒక్క బెంగాల్ మినహా మిగతాచోట్ల ఎంతమంది చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారో స్పష్టంగా పేర్కొనలేదు. బెంగాల్‌లో 91 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. అందులో మరణించిన వారి పేర్లు 58.08 లక్షలు ఉన్నాయి. ఏటా ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగితే ఒక్కసారిగా ఇన్నిపేర్లను తొలగించాల్సిన అవసరం ఉండదు. అన్ని రాష్ట్రాల్లో సర్ పూర్తయితే ఎంతమంది ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతారన్నది ఇంకా స్పష్టం కాలేదు. మొత్తంగా ఈ సంఖ్య 10 కోట్లు దాటుతుందనే అంచనాలు ఉన్నాయి. సర్ పూర్తయిన చోట ఇప్పటివరకూ 5 కోట్లకు పైబడి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. తుది లెక్కలు తేలేసరికి దాదాపుగా 10శాతానికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతస్థాయిలో ఇలా తొలగింపులు జరగలేదన్న విమర్శను తేలికగా కొట్టేయలేం. చనిపోయిన వాళ్లను, ఒకటికి మించి పలుచోట్ల ఓటర్లుగా ఉన్న వాళ్లను జాబితా నుంచి తొలగించటానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే వెసులుబాట్లను కనుక్కోకుండా మీరు పౌరులో కాదో నిరూపించుకోండని అందరినీ కోరటం నిర్హేతుకంగానే ఉంటుంది. ఎన్నికలు ముంగిట్లోలేని రాష్ట్రాల్లో సర్ తొలగింపులతో నష్టం తక్కువగానే ఉండొచ్చు. తక్షణ రాజకీయ అవసరాలు ఉన్నచోట పరిస్థితి వేరుగా ఉంటుందన్నదానికి బిహార్, బెంగాల్ ఎన్నికలప్పుడు చెలరేగిన వివాదాలే నిదర్శనం. సర్‌తో ఓట్లు తొలగిన తర్వాతా మళ్లీ జాబితాలో కొత్త ఓటరుగా నమోదుకావటానికి అవకాశం ఉంటుందని అధికారులు ఒకటికి పదిసార్లు చెప్పారు. నిబంధనలు అందుకు అనుకూలంగా ఉన్నాయనీ స్పష్టంచేశారు. కానీ, రోజులు గడవకుండానే మెలికపెట్టారు. దీనినీ సర్‌తో ముడిపెట్టారు. మొత్తంగా ‘సర్’తో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాత పాత్రపై నమ్మకం పలచబడిపోయింది. మళ్లీ దాన్ని బలోపేతం చేసుకుంటేనే ఎన్నికల కమిషన్ పాత్రకు సార్థకత చేకూరుతుంది. భవిష్యత్తులో ఇదే తరహా సర్‌లు పునరావృతమైతే కమిషన్ సమర్థతపైనే సందేహాలు అలుముకుంటాయి. పాస్‌పోర్టు కూడా భారత పౌరసత్వానికి చిహ్నం కాదన్న విచిత్రవాదనతో అంతర్జాతీయంగా పరువుపోయింది. సర్ పేరుతో ఇంత జరిగిన తర్వాత కూడా భవిష్యత్తులో ఓటరు కార్డులకు ప్రామాణికత ఉండదనే వాదనను మళ్లీ చేస్తే ఎన్నికల కమిషన్ తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవటం కష్టం! ఓటరు కార్డులున్న వారందరినీ పౌరులుగా భావించలేమన్న వాదనను ఎల్లకాలం కొనసాగించితే అది మన ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ!

# రైతు వేదికల ద్వారా స్వయం సహాయక బృందాలతో యూరియా అమ్మకాలు

-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

హంసకలం వార్త

జిల్లాలో గ్రామీణ మహిళా సంఘాల ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా రైతు వేదికల ద్వారా ఉమ్మడి ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎరువుల పంపిణీ,ఆయిల్ ఫాం పంట సాగు,ఇతర అంశాలపై ఆయా శాఖల అధికా రులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రైతులకు ఎరువుల కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచేందుకు రైతు వేదికల వద్ద స్వయం సహాయక బృందాల ద్వారా యూరియా అమ్మకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.దీనివల్ల రైతులకు స్థానికంగానే ఎరువులు లభించడంతో పాటు మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు.జిల్లాలోని భీంపూర్,ఆదిలాబాద్ రూరల్,తాంసి,ఇచ్చోడ, బోరజ్, జైనత్, గుడిహత్నూర్, మావల, తలమడుగు సహా మొత్తం 15 మండలాల్లోని రైతు వేదికల్లో మొదటి విడతగా ఈ విక్రయ కేంద్రాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎరువుల వ్యాపార నిర్వహణకుగాను ఎంపిక చేసిన మహిళా సంఘాలకు తక్షణమే 6 నెలల తాత్కాలిక లైసెన్సులను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఈ కేంద్రాల ద్వారా క్రిమిసంహారక మందులు,విత్తనాల విక్రయాలకు లైసెన్సులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం ఎఫ్.ఓ.ఎఫ్.ఓ విధానాన్ని





రద్దు చేసిన నేపథ్యంలో,రవాణా ఛార్జీల భారం సంఘాలపై పడకుండా స్థానిక మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతుల నుండి రవాణా ఖర్చులను వసూలు చేసుకునే వెసులుబాటును మహిళా సంఘాలకు కల్పించారు.మహిళా సంఘాలు నిర్వహించే ఈ వ్యాపారానికి స్థానిక ఎం.పి.డి.ఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు లేబర్, సెక్యూరిటీ పరంగా పూర్తి అండగా నిలవాలని స్పష్టం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల స్టాక్ కొనుగోలుకు సంఘాల వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం రైతు వేదికల్లో తాత్కాలికంగా ప్రారంభమవుతున్న ఈ కేంద్రాలను,రాబోయే 6-7 నెలల్లో ఎన్.ఆర్.ఎల్.ఎం, బి.పి.జి నిధుల రూ.30 లక్షలతో నిర్మించబోయే శాశ్వత వి.ఓ భవనాలు, గోదాముల్లోకి మారుస్తామని తెలిపారు. విక్రయాలు,స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే పనులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులను హెచ్చరించారు. అలాగే,12 నెలల నీటి వసతి ఉన్న రైతులకు ఆయిల్ పామ్, నిమ్మ, మామిడి వంటి తోటల పెంపకానికి 40 నుండి 50 శాతం వరకు సబ్సిడీలు అందిస్తున్నామని, ఆయిల్ పామ్ డ్రిప్ కోసం ఎకరానికి రూ.22,800 సబ్సిడీతో పాటు, తోటల నిర్వహణకు 4 ఏళ్ల పాటు ఏటా రూ.4,200 ఇస్తామన్నారు.అదేవిధంగా కేజీబీవీ విద్యార్థులకు జూలై 15 లోగా, ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జూలై 30 లోగా మొదటి జత యూనిఫాంల కుట్టుపని పూర్తి చేసి, ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏపీఎంలను ఆదేశించారు.అలాగే, జిల్లాలో ఇంకా పొదుపు సంఘాల్లో చేరని 22 వేల మంది మహిళలను గుర్తించి,జూలై 31 లోగా వారిని సంఘాల్లో చేర్చి, బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీఓ రవీందర్, డీసీఓ సత్యనారాయణ, డిఏఓ రవీందర్, డిహెచ్ఎస్ఓ నర్సయ్య,మార్క్‌ఫెడ్ డిఎం మహేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఎపిఏంలు,అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.ఖ

# తెలంగాణ ఉద్యమకారుల శాశ్వత రక్షణకు కమిషన్

-విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్
-ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ప్రతి నెలా పెన్షన్
-సానుకూలంగా స్పందించిన ఉద్యమకారుల కమిటీ

హంసకలం వార్త



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ విషయంలో పలువురు ఉద్యమకారులు ప్రభుత్వం ముందు కీలక డిమాండ్లు ఉంచారు. చట్టబద్ధ హోదా, జీవిత కాల పెన్షన్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వారి పిల్లలకు ఉచిత విద్య, 250 గజాల ఇంటి స్థలం తదితర డిమాండ్లు చేశారు. వాటిపై కమిటీ సానుకూలంగా స్పందించింది స్వరాష్ట్ర సాధనలో రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు కొనియాడారు. రాజధాని నగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో జరిగిన చారిత్రాత్మక ఆందోళనలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ విజయవంతం కావడానికి ఇక్కడివారు వెన్నుముకగా నిలిచారన్నారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక చిహ్నంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. జిల్లాల ప్రతినిధులు, ఉద్యమకారులు తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును రక్షించాలని కోరుతూ కమిటీ ముందు

-ఈ ప్రధాన సంక్షేమ డిమాండ్లను ఉంచారు.

భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా ఉద్యమకారుల హక్కులకు శాశ్వత రక్షణ ఉండేలా, ఈ కమిషన్‌ను ఒక చట్టబద్ధమైన సంస్థగా మారుస్తూ చట్టం తీసుకురావాలని కోరారు. నాటి పోరాటంలో సర్వస్వం కోల్పోయిన ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ విద్యాసంస్థల అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పించాలని అన్నారు. స్వరాష్ట్ర సాధనలో పురుషులతో సమానంగా లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లిన మహిళా పోరాట యోధులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యతతో పాటు ప్రత్యేక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో జీవితకాల ఉచిత ప్రయాణ రవాణా పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. గుర్తింపు పొందిన ఉద్యమకారుల పిల్లలకు లేదా వారి తదుపరి తరానికి కేజీ నుండి పీజీ వరకు పూర్తి ఉచిత, నాణ్యమైన విద్యను ప్రభుత్వమే అందించాలి. ప్రభుత్వటెండర్ల సమాచారం సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం ఉచితంగా 250 గజాల భూమిని కేటాయించి, రిజిస్ట్రేషన్ చేయించాలి. వృద్ధాప్య దశలో ఉన్న ఉద్యమకారులు ఎవరిపైనా ఆధారపడకుండా, సమాజంలో ఆత్మగౌరవంతో బ్రతకడానికి వీలుగా గౌరవప్రదమైన జీవితకాల నెలవారీ పెన్షన్ ప్రతి నెల 1వ తేదీనే అందించాలి. అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా అపరిమిత వైద్య సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక హెల్త్ కార్డులను జారీ చేయాలి. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ ఆధారంగా, ఏ ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా ఈ హక్కులను సాధించి తీరుతామని గట్టి భరోసా ఇచ్చారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇవాళ సభలో ఉద్యమకారులు ప్రతిపాదించిన అంశాలను సమగ్ర నివేదికలో చేర్చుతామని, ముఖ్యమంత్రి కి నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ కె కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్ కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వటెండర్ల సమాచారయ్

# ఆ ఆరు హత్యలు ఎందుకు చేశానంటే?

-తెలంగాణను కుదిపేసిన 6 హత్యలకేసులో కొత్త ట్విస్ట్ ?
-షాబాద్ కిరాతకుడి సెల్ఫీ వీడియో?

హంసకలం వార్త

షాబాద్ ను కుదిపేసిన 6 హత్యల కేసులో కొత్త ట్విస్ట్. హత్యలకు ముందు రాజ్‌కుమార్ రికార్డు చేసిన సెల్ఫీ వీడియో పోలీసులకు దొరికింది. అందులో అప్పులు, నమ్మకద్రోహం గురించి ఏమన్నాడు? దర్యాప్తులో బయటపడిన కీలక వివరాలు చదవండి తెలంగాణలో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ముందు స్వయంగా రికార్డ్ చేసుకున్న వీడియోను పోలీసులు గుర్తించారు. నిందితుడి మృతదేహం వద్ద మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు. దాన్ని పరిశీలించగా అందులో తాను ఈ ఘాతుకాలకు ఎందుకు పాల్పడుతున్నదీ వివరిస్తూ సెల్ఫీ వీడియో చేశాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఈ వీడియోను ఆయన మీడియాకు చూపారు. మృతురాలి కుటుంబం వల్ల తాను అప్పులపాలయ్యానని, తనను నమ్మించి ద్రోహం చేశారని రాజ్‌కుమార్ ఆ వీడియోలో ఆరోపించాడు. ఈ వీడియోను ఘాతుకాలకు కొద్దిగా ముందు జూలై 10వ తేదీ సాయంత్రం 4.55 గంటల సమయంలో రికార్డు చేసినట్టుగా ఉంది. తన సంపాదనలో సగం వాళ్లకోసమే ఖర్చు పెట్టానని, తన వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని, తనను రోడ్డున పడేశారని తెలిపాడు. అప్పులపాలయ్యానని, పిల్లలకు రూపాయి విలువ చేసే భూమి కూడా లేకుండా అయిపోయిందని చెప్పుకొచ్చాడు. ఇంత చేసీ చివరకు తనపైనే కేసు పెట్టి జైలుకు పంపారని తెలిపాడు. నమ్మి ద్రోహం చేసినందుకే వాళ్లను చంపాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. ఇదే కేసులో మరో కీలకాంశం కూడా వెల్లడైంది. హత్యల సమయంలో బాలికను రాజ్‌కుమార్ ఒక కారులో తీసుకువెళ్లినట్టు సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డయింది. బాలిక కారులో ఉండగానే తన ఇద్దరు పిల్లలను, భార్యను కూడా చంపినట్టు తెలుస్తున్నది. చివరకు బాలికను అఖిల్ సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోసి చంపేశాడు. ఈ హత్యలన్నీ కొన్ని గంటల వ్యవధిలోనే వేరువేరు ప్రాంతాల్లో చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ వీడియోతో పాటు ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. దర్యాప్తును వేగవంతం చేశారు.



## బీసీ యాదవ మహిళను దూషించిన శివచరణ్ రెడ్డిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి

-కుల అహంకారాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తుందా?
- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్

హంసకలం వార్త




యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలు,82 ఏళ్ల వృద్ధురాలు,బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి చేసిన అవమానకర వ్యాఖ్యలను బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తోంది.బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ...ఒక వృద్ధ మహిళను, అదీ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధిని కేవలం తన తండ్రి ఫోటో ఫ్లెక్సీలో లేదనే కారణంతో అవమానించడం అత్యంత నీచమైన,కుల అహంకారంతో కూడిన చర్య అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నమ్మకంతో ఒక బీసీ మహిళకు బాధ్యత అప్పగిస్తే,దానిని సహించలేక కుల దురహంకారంతో అవమానించడం బీసీల ఆత్మగౌరవంపై దాడి చేసినట్టేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు కుటుంబ వారసత్వం వల్ల కాదు, అర్హత వల్ల వస్తాయని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. క్కిడి శివచరణ్ రెడ్డిని వెంటనే యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి బర్తరఫ్ చేసి,ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ సమాజ్ డిమాండ్ చేసింది.లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను అవమానించే శక్తులకు అండగా నిలుస్తోందనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై వెంటనే స్పందించి బీసీలకు క్షమాపణ చెప్పాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు,నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని కించపరిచే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ప్రతి అవమానానికి ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా గట్టి సమాధానం ఇస్తామని నరెడ్ల శ్రీనివాస్ హెచ్చరించారు.

# ఏ సి బి వలలో అవినీతి చేప

-రెండు లక్షలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన మున్సిపల్ ఏ ఈ

హంసకలం వార్త



పెద్దపల్లి జిల్లా మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కల్లేపల్లి సతీష్ కుమార్ ను అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు మంగళవారం లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కరీంనగర్ ఏసీబీ డి ఎస్పీ జి. మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన ఈ దాడిలో నిందితుడు ఫిర్యాదుదారుడు శీను నుండి 2 లక్షల లంచం స్వీకరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో టీయూఎఫ్ఎస్ఐడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు, తెనుగువాడ మరియు కునారం రోడ్డు శ్మశానవాటికల నిర్మాణ పనులకు సంబంధించిన తుది బిల్లును ప్రాసెస్ చేసి పరిపాలనా ఆమోదం కోసం పంపించేందుకు అసిస్టెంట్ ఇంజనీర్ కల్లేపల్లి సతీష్ కుమార్ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో నిందితుడిని పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుంచి 2 లక్షల లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, అనంతరం అతని నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.32,31,900 విలువైన లెక్కల్లో చూపని నగదు లభ్యమైనట్లు వెల్లడించారు. ఈ నగదును స్వాధీనం చేసుకుని విచారణలో భాగంగా స్వరూపాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినా లేదా స్వీకరించినా వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డి ఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ సి బి ఇన్స్పెక్టర్ లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

-కలెక్టర్ చిత్రా మిశ్రా



హంసకలం వార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను మంగళవారం.. అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను చిన్న చిన్న భాగాలుగా విభజించి పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణ పరిసరాలను కలియ తిరుగుతూ సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్ టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
బుధవారం 15 జూలై 2026

## పెద్దపల్లి విమానాశ్రయాన్ని పక్కన పెట్టడం అన్యాయం

**-ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



హంసకలం వార్త

కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్,వరంగల్ విమానాశ్రయాలపై ముందుకు వెళ్తూ, ముందంజలో ఉన్న పెద్దపల్లి విమానాశ్రయ ప్రతిపాదనను వాయిదా వేయడం పట్ల పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పలు సందర్భాల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి పెద్దపల్లి విమానాశ్రయాన్ని అత్యవసరంగా ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు. ఉడాన్(ఖణూచీ)పథకం కింద పెద్దపల్లికి విమానాశ్రయాన్ని మంజూరు చేయాలని పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన హామీ లేదా సానుకూల నిర్ణయం రాలేదని పేర్కొన్నారు.పెద్దపల్లి ప్రాంతంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో ఉండటంతో పాటు, పారిశ్రామిక మరియు వ్యాపార కార్యకలాపాలు విస్తృతంగా జరుగుతున్నాయని,ఈ నేపథ్యంలో విమానాశ్రయానికి గణనీయమైన ప్రయాణికుల డిమాండ్‌తో పాటు ఆదాయ అవకాశాలు కూడా ఉన్నాయని ఆయన వివరించారు. అయినప్పటికీ రాజకీయ కారణాలతో పెద్దపల్లి విమానాశ్రయ ప్రతిపాదనను పక్కన పెట్టడం విచారకరమని విమర్శించారు. పెద్దపల్లి ప్రజల న్యాయమైన హక్కు కోసం పార్లమెంట్‌లో ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించి,అవసరమైతే ఉద్యమం చేపట్టి విమానాశ్రయాన్ని సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.పెద్దపల్లి ప్రజల అభివృద్ధి,పారిశ్రామిక ప్రగతి,ఉపాధి అవకాశాల విస్తరణ కోసం విమానాశ్రయం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెద్దపల్లి విమానాశ్రయానికి తక్షణమే ఆమోదం ఇవ్వాలని ఆయన కోరారు.

## భాష విద్యార్థికి సులభంగా అర్థం కావాలి

**-నిత్య జీవితంలో ఆ పదాలు వినియోగించేలా సామర్థ్యాలు మెరుగు పడాలి**

**-పిల్లలు ఆసక్తితో బడికి వచ్చేలా బోధించాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**



హంసకలం వార్త

తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి సులభంగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు భాషను బోధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపు నిచ్చారు.ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ లో భాగంగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ శిక్షణ ఇస్తుండగా,మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ విన్నారు.ప్రతి సారి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల స్థానంలో కూర్చుని పాఠాలు వినడం,వారి అనుభవాలను,శిక్షణ ప్రక్రియపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అలాగే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గీతా నగర్ సిరిసిల్ల,ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, ప్రాథమిక స్థాయి ఎంఆర్ పీలకు తెలుగు,ఇంగ్లీష్,మ్యాథ్స్ అంశాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేటలో శిక్షణ కొనసాగుతున్నది.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందించే ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు.శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం రోజు వారి బోధనలో ఉపయోగించాలని సూచించారు.విద్యార్థి కేంద్రీకృత,వివిధ రంగులు ఉపయోగిస్తూ కృత్యాదార బోధన చేయాలని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి తెలుగు,ఇంగ్లీష్,హిందీ పదాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని ఆదేశించారు.రోజు వారి జీవితంలో భాగంగా వినియోగించే పదాలు,అంకెలు, పండ్లు, ఇతర విషయాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని తెలిపారు. బోధనలో టీఎల్ఎంలు వినియోగించి విద్యార్థులు ఆసక్తితో బడికి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు.విద్యార్థులు ఇంగ్లీష్,మ్యాథ్స్ ఇతర అంశాల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగు అయ్యేలా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులందరూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో అమలు చేయాలని,మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్,విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత



హంసకలం వార్త

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ అమలును రాయికల్ పట్టణంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తుదారులకు తగిన సహాయం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున , ఎన్నికల విభాగం, బి.ఎల్.వో లు రెవెన్యూ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# 3427 దేవాలయాలకు ప్రభుత్వం బోనాలఉత్సవాల నిర్వహణకురూ15.05కోట్లు

**-జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జంటనగరాల్లో అత్యంతవైభవంగా బోనాలు**

**-బోనాల మహోత్సవాలకు రాష్ట్రప్రభుత్వం,అధికారులు సర్వం సిద్ధం**

**-ఈ నెల 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి బోనాలు**

హంసకలం వార్త

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సర్వం సిద్ధం చేశారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాల్లో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత జిహెచ్ఎంసి పరిధిలోని 3427 దేవాలయాలకు ప్రభుత్వం బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.15.05 కోట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**-ఈ నెల 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి బోనాలు**

ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభ మవుతాయని తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కో లు ఉత్సవం, 21న అమ్మవారి కళ్యాణం, 22న రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. ఆగస్టు 2న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు, ఆగస్టు 3న రంగం నిర్వహిస్తారని తెలిపారు. ఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పొన్నం సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సర్వం సిద్ధం చేశారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్--సికింద్రాబాద్ జంట నగరాల్లో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బోనాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి



అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో తొలి బోనాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం జూలై 20న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు, 21న కల్యాణోత్సవం, 22న రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఆగస్టు 2న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం, ఆగస్టు 9న లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలు జరగనున్నట్లు మంత్రి వెల్లడించారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 3,427 ఆలయాలకు మొత్తం రూ.15.05 కోట్ల నిధులను విడుదల చేసింది. ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లకు ఈ నిధులను వినియోగించనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఈ ఏడాది బోనాల మహోత్సవాలు మరింత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక

**-నులను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలి**

**-గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలి**

**-ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**

**-ప్రజా పాలన రెండో విడతకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**

**-రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి ప్రజా పాలన జిల్లా ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా**

హంసకలం వార్త

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి, ప్రజా పాలన జిల్లా ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత, మొక్కల పెంపకం, ప్రజారోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించే విధంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ, జిల్లా ప్రణాళిక, జిల్లా పంచాయతీరాజ్, మైనారిటీ సంక్షేమ, పశుసంవర్ధక, వ్యవసాయ, ఆర్ అండ్ బి, డీఆర్‌డీఏ, డీఎంహెచ్‌వో, రెవెన్యూ తదితర శాఖల జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, భవిష్యత్ కార్యాచరణపై శాఖల వారీగా సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి షఫీయుల్లా మాట్లాడుతూ.... గత నెలలో జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమక్షంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రగతిని వివరించినట్లు తెలిపారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా పాలన కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న తీరు రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించిందని, జిల్లాలో అధికారులు చూపుతున్న చొరవపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో జిల్లా అధికారులు చేపట్టిన చర్యలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, సుమారు 18 వేల మంది రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించి వ్యవసాయంలో వినియోగించేలా చేసిన చర్యలు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్నాయని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా ఉత్పాదకత పెరగడంతో పాటు ఎరువుల వినియోగం కూడా సమర్థవంతంగా జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక తొలి విడత జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని, ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలోనే రెండో విడత కార్యక్రమాన్ని సైతం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం రెండో విడత ప్రారంభానికి ముందే అన్ని శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకొని, గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి అమలు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. జిల్లాలో ప్రతి శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై రాష్ట్రస్థాయిలో నిరంతర సమీక్ష జరుగుతోందని ఆయన తెలిపారు. శాఖలు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలు, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తున్న విజయగాథలను సకాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొంటూ, ఎల్-3 జాబితాలో అర్హత పొందిన లబ్ధిదారులకు గృహాల మంజూరు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలపై రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో భవనాలు లేని 134 గ్రామపంచాయతీలకు కొత్త పంచాయతీ భవనాల నిర్మాణం కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతులను పొందేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణం గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలోని సుమారు 11 లక్షల పశువులకు డీ-వార్మింగ్ మందుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాకు చేరేలా అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. పశు సంపద ఆరోగ్యవంతంగా ఉంటే రైతుల ఆదాయం పెరుగుతుందని, పాల ఉత్పత్తి, పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. మినుములు, పెసర్లు, కూరగాయలు, ఉద్యాన పంటలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో



జిల్లాలోని పాఠశాలల బాలికలతో 450 స్నేహ గ్రూపులను ఏర్పాటు చేసి మాక్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న కార్యక్రమమని ప్రత్యేక అధికారి షఫీయుల్లా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతున్నాయని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో తల్లి శిశువుల రక్తహీనత సమస్యను తగ్గించేలా జిల్లాలో బాలామృతం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో నిర్వహిస్తున్న శాఖలోని ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీలు, రోడ్డు భద్రత కార్యక్రమాలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు, మొక్కల పెంపకం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజా పాలన రెండో విడతలో నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా సూచించారు. అదేవిధంగా జిల్లాలో షాదీ ముబారక్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి లబ్ధిదారులకు డబ్బులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాది ముబారక్ పంపిణీకి జిల్లాలో నిధుల కొరత లేదని, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిష్కరించి లబ్ధిదారులకు డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..... జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులతో పాటు కొనసాగుతున్న కార్యక్రమాల వివరాలను ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నిటిని చెప్పే స్థాయిలో పరిశీలించి అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర , అదనపు కలెక్టర్ రెవిన్యూ ఇంచార్జ్ అరుణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు గోపాల్ నాయక్, చిన్న ఓబులేష్, రమాదేవి, డాక్టర్ కృష్ణ, శ్రీరాములు, జ్ఞాన శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తాం

-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
-ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు
-బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు.. భక్తులకు అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
-అదనపు అభివృద్ధి పనులకు మరో రూ.50-60 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో

హంసకలం వార్త



2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హను మంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో వీఐపీ ఘాట్లు, సాధారణ స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, రహదారుల విస్తరణ, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవస్థానం, ఉగ్ర నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల దేవస్థానం పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు, అంచనాలు, కాలపట్టికలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసేలా తగిన సూచనలు అందించారు. తొలి విడతలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజలందరూ భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 2027 గోదావరి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జూలై-2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేబినెట్ ఉపసంఘం నిర్ణయం మేరకు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన దేవాలయాల పునరుద్ధరణతో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లను కేటాయించిందనిఅందులో ధర్మపురి, కోటిలింగాల పుష్కరాల ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ హను మంతరావు ధర్మపురి, కోటిలింగాలను సందర్శి ంచారని, అధికారులు నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా బాసర, కాళేశ్వరం, వేములవాడ, యాదాద్రి, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ సంగనభట్ల దినేష్, దేవాలయం ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు, పంచాయతీ రాజ్ ఏఈ లు, రోడ్డు భవనాల శాఖ ఏఈ లు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్రం ముందడుగు

-కార్మికుల హక్కు సాధనకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాటం ఫలిస్తోంది

హంసకలం వార్త

కేంద్ర కార్మిక ఢ ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా, రాష్ట్ర కార్మిక, ఉపాధి,శిక్షణఢ ఫ్యాక్టరీలు,గనులుఢ భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామిలి తో కలిసి రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్టీ తరఫున కాన్ఫరెన్స్ కాల్ ద్వారా పాల్గొని, గతంలో టెండర్ దశ వరకు వెళ్లి నిలిచిపోయిన రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాజెక్టును వెంటనే పునఃప్రారంభించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ...రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి సింగరేణి కార్మికులు,పారిశ్రామిక కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న హక్కు అని పేర్కొన్నారు. వేలాది మంది కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలంటే ఈ ఆసుపత్రి నిర్మాణం అత్యవసరమని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో అన్ని పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి,నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు గుర్తు చేసిన ఎంపీ, రామగుండంఈఎస్ఐ ఆసుపత్రి పూర్తయ్యే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ,రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామిఈ అంశంపై సానుకూలంగా స్పందించడం



పట్ల ఎంపీ వంశీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల ఆరోగ్య భద్రతే మా ప్రాధాన్యం... రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు మా పోరాటం ఆగదు అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# ఆపరేషన్ ముస్కాన్ సమర్థవంతంగా అమలు చేయాలి





-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి,బాల కార్మికులు, వీధి బాలలు,ప్రమాదకర పరిస్థితులలో ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణమే రక్షించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా యంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి చంద్రయ్య,డి.సి.పి. ఎ.భాస్కర్,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని హోటళ్లు,దాబాలు,టీ స్టాళ్లు,గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు,ఇటుక బట్టీలు,నిర్మాణ పనులు, షాపింగ్ సముదాయాలు, వ్యవసాయ క్షేత్రాలు తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన ప్రతి చిన్నారికి వైద్య పరీక్షలు,కౌన్సిలింగ్, విద్యలో పునఃప్రవేశం, కుటుంబ పునరావాసం / అవసరమైతే బాలల సంరక్షణ సంస్థలలో ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజ మానులు, చిన్నారులను దుర్వినియోగం చేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరపూరిత చర్యలను అరికట్టాలని పోలీసు శాఖకు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్-XII లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని,ప్రతి రెస్క్యూ చర్యను పకడ్బందీగా నమోదు చేసి,సంబంధిత శాఖలకు సకాలంలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు,వ్యాపార సంస్థలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలలో చైతన్యం కల్పించాలని,బాలల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. డి.సి.పి.మాట్లాడుతూ...బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరుగుతున్న దోపిడీ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, కార్మిక, విద్యా, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

# తాగునీటిని వృధా చేస్తే జరిమానా విధింపు



హంసకలం వార్త

ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృధా చేయకుండా, భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృధా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపడుతూ, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవకాశం ఉన్న చోట ఫాంపాండ్స్, ఇతర వాటర్ షెడ్ నిర్మాణాలు జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయిన చోట, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో వీటి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఎక్కడ కూడా తాగునీటి విషయమై ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ఖరీఫ్ పంటల సాగుకు ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు అవసరమైన మొదటి, రెండు తడులు నీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాశ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



హంసకలం వార్త

జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి.ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్,ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? - అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు. ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు. భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు. సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.



# ఐమాక్స్ ఫార్మాట్‌లో 'మహాకాళి' చివరి దశకు చిత్రీకరణ

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న మరో ప్రతిష్ఠాత్మక చిత్రం 'మహాకాళి'. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'హనుమాన్' తర్వాత వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పూజ కొల్లూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 125 రోజుల పాటు సుదీర్ఘంగా చిత్రీకరణ జరుపుకున్న 'మహాకాళి', ఇప్పుడు తుది షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నాతో పాటు యువ నటుడు రోహిత్ షరాఫ్ తమ పాత్రలకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రేక్షకులకు అత్యున్నత స్థాయి విజువల్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావస్తు ండటంతో, త్వరలోనే విడుదల తేదీతో పాటు మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను ప్రకటిస్తామని చిత్ర యూనిట్ వెల్లడించింది. 'హనుమాన్' యూనివర్స్‌లో రాబోయే ఈ కొత్త అధ్యాయం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్ సేతుపతి 'ట్రైన్' వచ్చేస్తోంది- రిలీజ్ ఆగస్టులోనే

మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయను న్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసు కెళ్తున్న 'బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్' రైలును కొంత మంది సాయు ధులు తమ అధీనంలోకి తీసుకోవడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేందుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆకట్టుకునేలా రూపొం దించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, "ఈ సిని మాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసు కువస్తాం" అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సర దాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుండా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపిం చారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం 'అంజాదే'కు కొనసాగింపు కావచ్చని, తద్వారా 'మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్'కు అంకు రార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగా నాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటిం చనున్నా రు.




# 'పరిమళ అండ్ కో' (జీ 5) మూవీ రివ్యూ!

కోలీవుడ్ లో దర్శకుడిగా పాండిరాజ్ కి మంచిపేరు ఉంది. వైవిధ్యభరితమైన కథలను తెరపై వినోదభరితంగా .. ఆసక్తికరంగా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. కామెడీ టచ్ ఇస్తూనే ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడంలో సిద్ధహస్తుడు. ఆయన రూపొందించిన సినిమానే 'పరిమళ అండ్ కో'. జయరామ్ ప్రధానమైన పాత్రగా తెరకెక్కిన ఈ సినిమా, జూన్ 5వ తేదీన థియేటర్లకు వచ్చింది. బ్లాక్ కామెడీ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి 'జీ 5' లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. నగరంలో పరిమళ ( జయరామ్) తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. అప్పారావు (యోగిబాబు) ఇంట్లో చాలా కాలం నుంచి అద్దెకి ఉంటాడు. ఆయన భార్య స్వరాజ్యం (ఊర్వశి) కూతుళ్లు పరాశక్తి (సంజనా కృష్ణమూర్తి) మధుమిత (అనంతిక). పరిమళ మిడిల్ క్లాస్ ఫ్యామిలీని చాలా పొదుపుగా నెట్టుకొస్తుంటాడు. అయితే ఆ సిటీలో వర్గీస్ (శాండీ) అనే జులాయి తిరుగుతూ ఉంటాడు. అతను నగరంలోని కాలేజ్ కుర్రాళ్లకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుంటాడు. అతని వెనక రాజకీయనాయకులు ఉండటంతో పోలీసులు వెనకడుగు వేస్తుంటారు. 'జాలరిపేట'కి చెందిన వర్గీస్, హత్యలు చేయడానికి కూడా ఎంతమాత్రం వెనుకాడడు. అందువలన అతనంటే అక్కడి వాళ్లంతా భయపడుతుంటారు. ప్రేమిస్తున్నానంటూ అతను మధుమిత వెంటపడుతూ ఉంటాడు. పరిమళతో పాటు అతని పెద్ద కూతురు .. చిన్నకూతురు ఎంతగా మందలించినా అతను వినిపించుకోడు. వర్గీస్ తల్లి సురేఖావాణి కూడా ఆ ఏరియాలో తన దందా కొనసాగిస్తూ ఉంటుంది. మధుమిత విషయంలో ఆమె కొడుకును మరింత సపోర్ట్ చేస్తుంది. దాంతో వర్గీస్ చనిపోతేనే తాము ప్రశాంతంగా బ్రతకగలమని పరిమళ భావిస్తాడు. మిగతా కుటుంబ సభ్యులంతా అతని నిర్ణయానికి తమ మద్దతును తెలియజేస్తారు. చిట్టీ ( సంతోష్ శోభన్)అనే యుకుడిని పరాశక్తి ప్రేమిస్తూ ఉంటుంది. వర్గీస్ విషయంలో తమ ఫ్యామిలీ తీసుకున్న నిర్ణయాన్ని గురించి ఆమె చిట్టీతో చెబుతుంది. ఆ మరుసటి రోజునే వర్గీస్ దారుణంగా హత్య చేయబడతాడు. ఈ వార్త బయటికి రాగానే, సిటీ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. వర్గీస్ చనిపోవడానికి ముందు అతనికి పరిమళ ఫ్యామిలీతో గొడవ జరిగిందని తెలుసుకున్న సురేఖావాణి, తన అనుచరులతో బయల్దేరుతుంది. వర్గీస్ తో పరిమళకు గల గొడవను గురించి తెలుసుకున్న పోలీస్ టీమ్ కూడా పరిమళ ఇంటికి బయల్దేరుతుంది. తన ఫ్యామిలీ ప్రమాదంలో పడుతుందని గ్రహించిన పరిమళ ఏం చేస్తాడు? అతను తీసుకున్న నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? వర్గీస్ ను హత్య చేసింది ఎవరు? అనేది మిగతా కథ. ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఒక రౌడీ హత్య కేసులో చిక్కుకుంటుంది. ఆ ఫ్యామిలీ కోసం ఒక వైపున పోలీస్ ఆఫీసర్ ఏడుకొండలు గాలిస్తుంటే, మరో వైపున ఆ రౌడీ తాలూకు గ్యాంగ్ వెంటాడుతూ ఉంటుంది. వాళ్ల బారి నుంచి ఆ ఫ్యామిలీ తప్పించుకో గలుగుతుందా? ప్రాణాలతో బయటపడ గలుగుతుందా? వర్గీస్ హత్య వెనకున్న సూత్రధారులు ఎవరు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. మధ్యతరగతి కుటుంబీకులు పరువుకు ప్రాణం ఇస్తుంటారు. డబ్బు .. అధికారం .. రాజకీయనాయకుల అండదండలు ఉన్నవారు, మిడిల్ క్లాస్ అమ్మాయిలను టార్గెట్ చేస్తుంటారు. అలాంటివారైతే పరువుకు భయపడి బయటికి రారనీ, తమని ఏమీ చేయలేరనే ఒక ధైర్యంతో ఉంటారు. అయితే అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీని కాపాడుకోవడానికి తండ్రి అనేవాడు ఎంతకైనా తెగిస్తాడనే విషయాన్ని చాటి చెప్పిన సినిమానే 'దృశ్యం'. అలాంటి ఒక సినిమాను పోలినదిగా 'పరిమళ అండ్ కో' కనిపిస్తుంది. అయితే కంటెంట్ పరంగా ఇది 'దృశ్యం' సినిమాకి పూర్తి భిన్నంగా ఉంటుంది. 'దృశ్యం' సినిమా సీరియస్ గా కొనసాగితే, ఈ సినిమా మాత్రం కామెడీ టచ్ ఇస్తూ ఫ్యామిలీ ఎమోషన్స్ ను కనెక్ట్ చేస్తుంది. హంతకుడు ఎవరనేది చివరివరకూ ఆడియన్స్ కనుక్కోలేని విధంగా దర్శకుడు ఈ కథను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449